

రేపు కూడ్లిగికి సీఎం సిద్దరామయ్య

బళ్లారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం విజయనగర జిల్లా కూడ్లిగికి రానున్నారు. జిల్లాలో 74 చెరువులకు నీరు నింపే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు సీఎం బెంగళూరు విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 10.50 గంటలకు జిందాల్ విమానాశ్రయంకు చేరుకుంటారు. అక్కడ నుంచి హర్పనహళ్లి చేరుకుని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. హర్పనహళ్లి నుంచి కూడ్లిగికి చేరుకుంటారు.

నేతలరాత..!





దావణగెరెలోని ఐసీపీఎల్ షుగర్ ఫ్యాక్టరీ



- చెరకు ధర నిర్ణయించేది నాయకులే
- రాజకీయ గుప్పిట్లోనే అధికంగా చక్కెర పరిశ్రమలు
- అన్నదాత పోరాటానికి దక్కని ఫలితం
- దక్షిణ భారతదేశంలో అత్యధిక సాగు రాష్ట్రంలోనే..
- 10 జిల్లాల పరిధిలో విస్తారంగా సాగు
- బెళగావిలోనే 29 కర్మాగారాలు

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వేదికలెక్కి ఉపన్యాసాలు చేసే రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమం, అభివృద్ధి ఉపాధి, అందరికీ ఆరోగ్యం, విద్య వంటివి తమ లక్ష్యాలని గొప్పలు చెబుతుంటారు. కానీ తనదాకా వస్తే దేనికైనా సరే ఆర్థికంగా నష్టపోయేందుకు మాత్రం అంగీకరించేది లేదంటారు. ఇటీవలికాలంలో వారసులు, పారిశ్రామికవేత్తలే రాజకీయాల్లో రాణిస్తున్నారు. అందుకు ప్రధానమైన రెండు కారణాలు ఉన్నాయి. ఎన్నికలవేళ కోట్లాదిరూపాయలు ఖర్చు చేయాలంటే నిజాయితీతో కూడిన వ్యాపారాలు, సాధారణ ఉద్యోగాల్లో కొనసాగేవారు, ఇతరత్రా రంగాల్లో అనుభవం ఉన్నా అందుకు తగిన ఆర్థికవనరులు సమకూర్చుకోవడం సవాల్‌గా మారింది. అందుకే చాలామంది ఎన్నికలకు వెళ్లేందుకు వెనకాడుతుంటారు. పరిశ్రమలు, రియల్‌ఎస్టేట్‌తోపాటు ఇతరత్రా రంగాలకు చెందినవారు మాత్రం ఎంతకైనా సిద్ధం, ఎవరితో తలపడేందుకైనా, ఎంతఖర్చుకైనా వెనుకాడేది లేదనేవారు పెరిగిపోతున్నారు.

దక్షిణభారతదేశంలో చెరకు అత్యధికంగా సాగు అయ్యేది కర్ణాటకలోనే. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో చెరకు సాగు చేస్తున్నా కేవలం కొన్ని జిల్లాలకు మాత్రమే పరిమితంగా ఉంది. కానీ కర్ణాటకలో 31 జిల్లాల్లో ఏకంగా 16 జిల్లాల పరిధిలో చెరకును విస్తారంగా సాగు చేస్తారు. కృష్ణా నదికి అనుబంధంగా విజయపుర జిల్లాలోని ఆల్మట్టి డ్యాంతోపాటు బెళగావి జిల్లాలోని పలు ప్రత్యేక సాగునీటి సౌకర్యాలు ఉండడంతో చెరకు సాగు చేస్తారు. ఉత్తర కర్ణాటక వ్యాప్తంగా చెరకు సాగుకు వాతావరణం కూడా అనుకూలమైంది. బెళగావి, బాగల్కోటె ప్రాంతాలకు అనుబంధమైన మహారాష్ట్రలోనూ చెరకు విస్తారంగా సాగు అవుతుంది. చెరకురైతులు ఏటా గిట్టుబాటుధర కోసం పోరాటాలు చేస్తుంటారు. నవంబరు, డిసెంబరు మాసంలో చెరకు కోతల పనులు ప్రారంభిస్తారు. ఇదే సమయంలోనే బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు జరుగుతాయి. బెళగావి ప్రాంతంలోనే అత్యధిక షుగర్ ఫ్యాక్టరీలు, రైతులు ఉండడంతో అక్కడి సమస్యను ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లేందుకు రైతులు రోడ్డెక్కుతారు. ఇలా పలుమార్లు శాసనసభ సమావేశాల వేళ బెళగావిలో ఉద్రిక్తతకు దారితీసిన సంఘటనలు ఉన్నాయి. అయితే చెరకు రైతులు ఎంత పోరాటం చేసినా యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ధరలు తగ్గిస్తారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి.

నాయకులే యజమానులు

- చిక్కోడిలోని చిదానంద ప్రభు, కోరె ఫ్యాక్టరీ చైర్మన్ మల్లికార్జున కోరె. ఇతను బీజేపీ కీలకనేత ప్రభాకర్ కోరె సమీపబంధువు. హుందరి గ్రామంలోని బెళగావి షుగర్స్, మూడలగి తాలూకాలోని హుణశ్యాలలోని సతీశ్ షుగర్స్ రెండు మంత్రి సతీశ్ జార్కిహొళికి చెందినవి.
- గోకాక్ ఫ్యాక్టరీ బీజేపీ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళికి చెందినది కాగా ప్రస్తుతం కాంట్రాక్టుకు ఇచ్చారు. గోకాక్‌లోని సౌభాగ్యలక్ష్మి ఫ్యాక్టరీ రమేశ్ జార్కిహొళి కుమారుడు అమరనాథ్ జార్కిహొళి పర్యవేక్షణలో ఉంది.
- సవదత్తిలోని హర్ష షుగర్స్ - ఎమ్మెల్సీ చన్నరాజ హట్టిహొళికి చెందినది కాగా ఇతను మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తమ్ముడు. సవదత్తిలోని శివశక్తి షుగర్స్, మరకుంబిలోని ఇనాందార్ షుగర్స్‌లు ప్రభాకర్ కోరెకు చెందినవి. కాగవాడలోని శిరగుప్పి షుగర్స్ మాజీ ఎమ్మెల్యే కళ్ళప్పణ్ణ మగణ్ణవర్‌కు చెందినవి.
- రాయబాగ తాలూకాలోని బీరేశ్వర షుగర్స్ మాజీ మంత్రి శ్యామనూరు శివశంకరప్పకు చెందినది. కాగవాడ తాలూకాలోని అథణి సుగర్స్ మాజీ మంత్రి శ్రీమంతపాటిల్‌కు చెందినది. అథణిలోని బసవేశ్వర షుగర్స్, మహారాష్ట్రలోని ఓ రాజకీయ నాయకుడికి చెందినవి.
- హుక్కేరి తాలూకాలోని విశ్వరాజ్ షుగర్స్ ఎమ్మెల్యే నిఖిల్‌కత్తికి చెందినవి. బైలహొంగలలోని సోమేశ్వర కో-ఆపరేటివ్ షుగర్స్ మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాళేకుంద్రి కుమారుడు బసవరాజ్ బాళేకుంద్రికి చెందినది. నిప్పాణిలోని హాలసిద్దనాథ షుగర్స్ - ఎంపీ పాటిల్‌కు చెందినది కాగా మాజీ మంత్రి అన్నాసాహెబ్‌జొల్లె డైరెక్టర్‌గా ఉన్నారు.
- అథణిలోని హల్యాలా షుగర్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ సవది తమ్ముడిది. ఘటప్రభ కో-ఆపరేటివ్ షుగర్స్ బీజేపీ ఎమ్మెల్యే బాలచంద్ర జార్కిహొళికి చెందినది. మలప్రభ కో-ఆపరేటివ్ షుగర్స్ ఎమ్మెల్సీ చన్నరాజహట్టిహొళికి చెందినవి. ఇతడికి రెండు ఫ్యాక్టరీలు ఉన్నట్టయ్యింది.
- సంకేశ్వరలోని హిరణ్యకేశి కో-ఆపరేటివ్ సుగర్స్ మాజీ ఎంపీ రమేశ్‌కత్తి దశాబ్దాలుగా కొనసాగారు. హుక్కేరిలోని సంగమ కో-ఆపరేటివ్ షుగర్స్ మాజీ మంత్రి మల్లారిగౌడ పాటిల్ అల్లుడికి చెందింది.

9 రోజులుగా రైతుల నిరసన

చెరకు రైతులు తొమ్మిదిరోజులుగా ఆందోళన చేస్తున్నారు. వారి ప్రధాన డిమాండ్ టన్ను చెరకుకు రూ.3,550 ప్రకటించాలనేది. చెరకు రైతుల పోరాటానికి బీజేపీ, జేడీఎస్ మద్దతు ఇవ్వడంతో పోరాటం మరింత తీవ్ర రూపం దాల్చింది. తొమ్మిదోరోజు శుక్రవారం బెళగావిలో ఉద్రిక్తతకు కారణమైంది. పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో రైతులు, పోలీసుల వాహనాలపై రాళ్లు రువ్వారు. ఈ పరిణామం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఉత్తర కన్నడ జిల్లాల్లో ఎటువంటి పరిస్థితులు తలెత్తుతాయోనని పోలీసులు బెంబేలెత్తుతున్నారు. రాష్ట్రంలో 16 జిల్లాల పరిధిలో చక్కెర ఫ్యాక్టరీలు ఉన్నాయి. మండ్య వంటి అత్యంత విస్తారమైన చెరకు సాగు చేసే జిల్లాల్లో కొన్ని కారణాలతో ప్రభుత్వానికి అనుబంధమైన పరిశ్రమలు మూతపడ్డాయి. కానీ రాజకీయ నాయకులు పర్యవేక్షించే పరిశ్రమలు మాత్రం సజావుగా సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల పరిధిలో 81 చక్కెర ఫ్యాక్టరీలున్నాయి. బెళగావి జిల్లాలో అత్యధికంగా 29 ఫ్యాక్టరీలు ఉండగా బాగల్కోటెలో 14, బిజాపూర్‌లో 10 ఫ్యాక్టరీలు ఉన్నాయి. మరో మూడు జిల్లాల్లో ఐదు చొప్పున, మిగిలిన జిల్లాల్లో 3 అంతకంటే లోపు పరిశ్రమలు ఉన్నాయి. ప్రతి పరిశ్రమకు రాజకీయబంధుత్వం ఉంది.

- రాయబాగలోని భావన షుగర్స్ మాజీ ఎంపీ ప్రభాకర్ కోరెకు చెందినది. రామదుర్గ తాలూకా ఉదుపుడి వద్ద ఉండే శివసాగర షుగర్స్ జమఖండి ఎమ్మెల్యే జగదీశ్ గుడగుంటికి చెందినది. ఇలా బెళగావిలోనే 29 ఫ్యాక్టరీలు నేతలతో సంబంధాలు కలిగినవే.
- బాగల్కోటెలో ప్రభులింగేశ్వర షుగర్స్ ఎమ్మెల్యే జగదీశ్ గుడిగంటికి చెందినది కాగా ముథోలలోని కేన్‌పవర్ లిమిటెడ్, రాష్ట్ర గనులశాఖ మంత్రి ఎస్‌ఎస్ మల్లికార్జునకు చెందినది. ముధోళలోని రన్నానగర్ షుగర్ ఫ్యాక్టరీ మాజీ మంత్రి ఎస్ఆర్ పాటిల్‌కు చెందినది. ఇక మాజీ మురుగేశ్ నిరాణి కుటుంబానికి చెందిన కుటుంబాని ఐదు ఫ్యాక్టరీలు ఉన్నాయి.
- జమఖండి షుగర్స్ కాంగ్రెస్ నేత ఆనందన్యామగౌడకు చెందినది. బీళగిలోని బీళగి షుగర్స్ మాజీ మంత్రి ఎస్ఆర్ పాటిల్‌కు చెందినది. విజయపురలోని కేపీఆర్ షుగర్స్ కేంద్రమాజీ మంత్రి చిదంబరంనకు సమీపబంధువు రామస్వామికి చెందినది. సింధగిలోని సాయిబసవ షుగర్స్ బీళగి ఎమ్మెల్యే జేపీ పాటిల్ బంధువు ఈరణగౌడ పాటిల్‌కు చెందినది.
- ఇండిలోని జమఖండి షుగర్స్ రెండు ప్లాంట్‌లు కాంగ్రెస్ నేత ఆనందన్యామగౌడకు చెందినవి. భీమాశంకర షుగర్స్ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్‌కు చెందినవి. బసవేశ్వరలోని బసవేశ్వర షుగర్స్ తమిళనాడుకు చెందిన రాజకీయ నేత శ్రీనివాసన్‌కు చెందినవి. ఇండి తాలూకాలోని ఐసీపీఎల్ షుగర్స్ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జునకు చెందినవి. ఇక బీదర్, కలబురగి, మండ్యలోని ఐదు రాజకీయ నేతలకు చెందినవి. 9 జిల్లాల్లో ఒక్కో ఫ్యాక్టరీ ఉండగా వాటికి రాజకీయ సంబంధాలు ఉన్నాయి.



ముధోళలోని నిరాణి షుగర్ ఫ్యాక్టరీ

భారతీయుల గుండెచప్పుడు

- వందేమాతరం అందరూ మెచ్చిన గేయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర
- ఘనంగా 150 సంవత్సరాల వేడుక



గేయాలాపనలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం కోట్లాది మంది భారతీయుల గుండెచప్పుడు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అన్నారు. వంతేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని పార్టీ నాయకులు ఆలకించారు. అనంతరం భరతమాత విగ్రహానికి పూలు చల్లి పూజలు నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ఒక గేయం కోట్లాదిమంది ఏళ్ల తరబడి ఆలపిస్తున్నారన్నారు. వందేమాతరం ప్రతి భారతీయుడి ప్రత్యేక గేయమని కొనియాడారు. ఎంపీ గోవింద కారజోళ, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణ స్వామి, మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్సీ రవికుమార్, రాజీవ్, భారతిశెట్టి, మాళవిక అవినాశ్, అంబికా హులినాయకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

సీఎం తుమకూరు పర్యటన రద్దు

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన తుమకూరు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనాల్సిన సీఎం సిద్దరామయ్య పర్యటన రద్దు అయ్యింది. సీఎం తుమకూరు జిల్లా పర్యటనకు రాజకీయ ప్రభావం ఉండడంతో సర్వత్రా చర్చలకు కారణమైంది. తుమకూరులో అధికారిక కార్యక్రమం ముగిశాక మాజీమంత్రి రాజణ్ణ ఏర్పాటు చేసిన విందులో పాల్గొనాల్సి ఉండేది. అందుకు రెండు రోజులుగా ఏర్పాట్లు సాగాయి. శుక్రవారం ఉదయమే రాజణ్ణ నివాసానికి పోలీసులు భారీగా తరలివచ్చారు. బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రితోపాటు హోం మంత్రి పరమేశ్వర్ తదితరులు విందులో పాల్గొంటారనే చర్చలు జరిగాయి. రాజకీయ చర్చలకోసమే విందు ఏర్పాటు చేశారనే విమర్శలు వచ్చాయి. రాజణ్ణ ఇంటికి సీఎం విందుకెళ్లడం ఇదేమి తొలిసారి కాకపోయినా ప్రస్తుత తరుణంలో విందులో జరిగే ప్రతి చర్చ కీలకమే కానుంది. అయితే మధ్యాహ్నం 3 గంటలదాకా చెరకు రైతుల సమస్యలపై చర్చల్లో సీఎం పాల్గొన్నారు. వాస్తవానికి 2 గంటలకు తుమకూరుకు సీఎం బయల్దేరాల్సి ఉండేది. చెరకు రైతుల సమస్యలు కొలిక్కి రాకపోవడంతో విందులో పాల్గొంటే విమర్శలు తలెత్తుతాయని సీఎం తన పర్యటనను చివరిక్షణంలో ఉపసంహరించుకున్నట్టు సమాచారం.



బెళగావి హత్తరగి టోల్‌గేట్ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

అన్నదాతపై విరిగిన లాఠీ

- బెళగావిలో తీవ్రస్థాయికి చేరిన చెరకు రైతుల నిరసన
- పోలీసు వాహనాలపై రాళ్లు రువ్విన రైతులు
- సీఎం సభలో టన్ను చెరకు రూ.3,330గా తీర్మానం

బెంగళూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరకోసం చెరకు రైతులు చేస్తున్న ఆందోళన శ్రుతి తప్పింది. తొమ్మిదోరోజు శుక్రవారం బెళగావి జిల్లా చిక్కోడి పరిధిలో వేలాదిమంది చెరకు రైతులు నిరసన శిబిరం వద్దకు చేరుకున్నారు. ఇదే సమయంలోనే వందలాదిమంది చెరకురైతులు బెంగళూరు - పూనె జాతీయ రహదారిని దిగ్బంధం చేయాలని భావించారు. హత్తరగి వద్ద ఉండే టోల్‌వద్దకు ట్రాక్టర్లు చేరాయి. ఒక్కసారిగా హైవేపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో బెళగావి జిల్లా ఎస్పీ భీమాశంకర్ గుళేద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు వాటిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఇదే సమయంలోనే చెరకు రైతులు, పోలీసుల మధ్య మాటల వివాదం రాజుకుంది. హైవేపై ఆందోళన చేస్తే వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నిలిచిపోతాయని, అత్యవసర వాహనాలు, గ్యాస్, పెట్రో ఉత్పత్తుల వంటి లారీలు ఆపితే ప్రమాదానికి కారణాలు కావచ్చునని పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాక్టర్లను అక్కడనుంచి తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నంలో పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. అప్పటికే వేలాదిమంది రైతులు నిరసన ప్రాంతంలో ఉన్నారు. విషయం తెలియగానే ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఒకానొక దశలో పోలీసు వాహనాలను టార్గెట్ చేసి మరింతనష్టం చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులకు రాళ్లు తగిలి గాయాలపాలయ్యారు. పరిస్థితి తారస్థాయికి చేరడంతో అదనపు బలగాలను రప్పించి టోల్‌గేట్ నుంచి రైతులను పంపేశారు. దీంతో వాహనాల రాకపోకలకు కొన్ని గంటల తర్వాత అంతరాయం తొలగినట్లయ్యింది. బెళగావిలో పోలీసులు లాఠీచార్జ్ చేశారనే అంశంతో బాగల్కోటె, విజయపురతోపాటు పలుచోట్ల చెరకు రైతులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. బాగల్కోటె జిల్లా రైతులు హుబ్బళ్ళి నుంచి సోలాపూర్‌కు వెళ్లే 218 జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. విజయపుర జిల్లా ఇండి పట్టణంలో రైతుల ర్యాలీని అడ్డుకునేందుకు రోడ్డుకు పూర్తిస్థాయిలో బ్యారికేడ్‌లను ఉంచి అడ్డుకున్నారు. మరోవైపు బెళగావి బంద్‌ను తాత్కాలికంగా వాయిదా వేశారు. ముఖ్యమంత్రి సభకు పిలుపునివ్వడంతో రెండురోజులపాటు బంద్‌కు విరామం ఇచ్చారు. అయితే పోలీసుల లాఠీచార్జ్‌తో శనివారం ఎటువంటి పరిస్థితులు నెలాకొంటాయనే చర్చలు జోరందుకున్నాయి. రాళ్లు రువ్విన ఆందోళనకారులు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో చెరకు రైతులు ఉన్నారా... లేదా పోకిరీలా అనే అంశం ఆరా తీస్తున్నారు.

లాఠీచార్జ్ వద్దు : హోం మంత్రి పరమేశ్వర్

చెరకురైతుల ఆందోళన సమయంలో పోలీసులు సమన్వయంగా వ్యవహరించాలని, రైతులపై బలప్రయోగం చేయరాదని హోం మంత్రి పరమేశ్వర్ సూచించారు. బెళగావిలో లాఠీచార్జ్ జరగలేదని, రైతులు కూడా ఆగ్రహానికి లోనై రాళ్లు రువ్వడం వంటి సంఘటనలకు పాల్పడరాదన్నారు. నిరసన సమంజసమని అది ప్రతి పౌరుడి హక్కు అని, అయితే రాళ్లతో కొట్టే ప్రక్రియ సరికాదన్నారు.

రాష్ట్ర బంద్‌కు సిద్ధం: రైతుసంఘం అధ్యక్షుడు

చెరకు రైతులకు నష్టం కలుగుతోందని ఆందోళన చేస్తుంటే పోలీసులు లాఠీచార్జ్ చేయడం సమంజసం కాదని రాష్ట్రరైతుసంఘం అధ్యక్షుడు చున్నప్ప పూజారి మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలవరకు ప్రభుత్వ నిర్ణయంకోసం వేచి చూస్తామని లేనిపక్షంలో కర్ణాటక బంద్ చేస్తామని హెచ్చరించారు. హత్తరగి ప్రాంతం నుంచి గుర్లాపుర్ క్రాస్‌కు ఆందోళన శిబిరాన్ని మార్చామన్నారు.

కొలిక్కిరాని సమస్య...

చెరకు రైతుల సమస్య తీవ్రరూపం దాలుస్తున్న తరుణంలో సీఎం సిద్దరామయ్య స్పందించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 81 చక్కెర ఫ్యాక్టరీల యజమానులు, రైతుసంఘాల నేతలతో విధానసౌధలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చక్కెరశాఖ మంత్రి శివానందపాటిల్, మంత్రులు ఎంబీ పాటిల్, హెచ్‌కే పాటిల్, ఆర్‌బీ తిమ్మాపుర, లక్ష్మీ హెబ్బాళ్కర్, ప్రియాంకఖర్గే పాల్గొన్నారు. చెరకు రైతుకు కేవలం గిట్టుబాటుధర మాత్రమే కాదని పలు సమస్యలు ఉన్నాయని రైతుసంఘం నేతలు ప్రస్తావించారు. తూకాలలో ఫ్యాక్టరీలు భారీగా మోసాలకు పాల్పడుతున్నాయని, గత ఏడాదికంటే (మిగతా 7వ పేజీలో..)



చెరకు పంటతో నిరసన వద్దకు చేరుకుంటున్న రైతులు

ఐదు కొత్త వంగడాలు..

- పరిచయం చేయనున్న జీకేవీకే
- 13 నుంచి కృషిమేళాకు సర్వం సిద్ధం



మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ ఎస్‌వీ సురేశ

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధమైన గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే) ఐదు కొత్త వంగడాలను పరిచయం చేస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ సురేశ తెలిపారు. శుక్రవారం జీకేవీకేలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జొన్నల్లో సీఎస్‌జీఎస్-1, 2 వెరైటీ, సూర్యకాంతిలో కేబీఎస్‌హెచ్ - 88, మినపలో బీసీహెచ్- 162, నల్లపసుపులో సీహెచ్ఎన్‌బీటీ - 1, పసుపులో ఐఐఎస్ఆర్ ప్రతిభ వంగడాలను కృషిమేళాలో లాంఛనంగా ఆవిష్కరిస్తామన్నారు. సీఎస్‌జీఎస్ జొన్న మధ్యమ వంగడమని, 100 రోజుల్లో కోతకు వస్తుందని, హెక్టారుకు 39-42 క్వింటాళ్ల జొన్నతోపాటు 30-33టన్నుల పశుగ్రాసం లభిస్తుందన్నారు. 5 డివిజన్లకు సిఫారసు చేశామన్నారు. సూర్యకాంతి కేబీఎసహెచ్ 88 స్వల్ప అవధి వంగడమని, 84-86రోజుల్లో కోతకు రానుందన్నారు. రోగనిరోధకశక్తి కలిగి ఉంటుందన్నారు. 19శాతం అధికంగా గింజలు దిగుబడికి రానున్నాయన్నారు. నూనెశాతం ఎక్కువగా ఉంటుందని, హెక్టారుకు 22-24 క్వింటాళ్ల దిగుబడి సాధ్యం కానుందన్నారు. 5, 6 డివిజన్లకు సిఫారసు చేశామన్నారు. ఈనెల 13నుంచి 16వరకు నాలుగురోజులపాటు కృషి మేళా జరుగుతుందన్నారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులు, కొత్తగా విడుదల చేసిన వంగడాలు, ఉద్యానవన పంటలు, నికర వ్యవసాయం, సిరిధాన్యాలు, సేంద్రియ వ్యవసాయం, మట్టిలేకుండానే వ్యవసాయం, మట్టి పరీక్షలకు అనుగుణంగా పంటలలో మార్పు, వర్షపునీరు నిల్వ, వ్యవసాయంలో కొత్త సమాచార సాంకేతికం. వ్యవసాయ పరికరాలు, మెట్టలో సాగు చేసే పంటల విధానాలు, పట్టు పరిశ్రమ, ఔషధ, సుగంధద్రవ్య మొక్కలు, సమగ్ర కీటకాలు, రోగాల నియంత్రణ, పోషకాంశాల నిర్వహణ, మార్కెట్ నైపుణ్యత, సూక్ష్మబిందుసేద్యం విధానాలు, వ్యవసాయ యంత్రోపకరణాల ప్రదర్శనలు, పశుసంవర్ధకశాఖ, పాడిపరిశ్రమ, గొర్రెలు, కోళ్లు, చేపల పెంపకంతోపాటు సాగులో సాంకేతిక సమస్యలకు నిపుణుల సలహాల కార్యక్రమం ఉంటాయన్నారు. మేళాను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ప్రారంభిస్తారన్నారు. ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతుల ప్రదానంలో సీఎం సిద్దరామయ్య పాల్గొంటారన్నారు.



ఫ్రీడంపార్కు వద్ద నిరసన తెలుపుతున్న జేడీఎస్ నాయకులు

ఆస్తి పన్నుల పెంపుపై జేడీఎస్ నిరసన 7

ప్రజలకు చెప్పండి..!

16 నెలల్లో ఎన్నో మంచి పనులు చేశాం

- వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి
- పనిచేసినవారికి నామినేటెడ్ పదవులిచ్చాం
- కూటమి కార్యకర్తలు కలిసికట్టుగా వెళ్లాలి
- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- కళ్యాణదుర్గంలో కార్యకర్తలతో సమావేశం
- యువనేతకు జనం, శ్రేణుల ఘన స్వాగతం



మంత్రి లోకేశ్ అభివాదం

కళ్యాణదుర్గం, అనంతపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి ప్రజలకు తెలియజేయాలని టీడీపీ కార్యకర్తలు, నాయకులకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. గడిచిన 16 నెలలలో ఎన్నో మంచి పనులను చేశామని ఆయన అన్నారు. కళ్యాణదుర్గంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఉత్తమ కార్యకర్తలకు ఆయన అవార్డులను అందించి, సన్మానించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి ఏపీని దేశంలో నంబర్ వన్ చేస్తామన్నారు. గతంలో ఎంతోమంది నిరుద్యోగులు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వైపు ఉపాధి కోసం వెళ్లేవారని పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆయా రాష్ట్ర ప్రజలు కూడా ఏపీ వైపు చూసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తన సొంత నిధులు కూడా వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడుపుతున్నారన్నారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాది, బలం అన్నారు. వారి శ్రమను, కృషిని ఎన్నటికీ మరచిపోలేమన్నారు.

అనుభవంతో నడిపిస్తున్నారు..

చంద్రబాబు తనకున్న అనుభవంతో రాష్ట్రాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ అన్నారు. 'ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు పెట్టారు. నాపై అక్రమ కేసులు పెట్టారు. పాదయాత్రలో ఇబ్బందులకు గురిచేసినా కార్యకర్తలు అండగా నిలిచారు. అందరూ వస్తారు. ఆ రోజుల్లో బయటకు రావాలంటే భయం. ఎక్కడ ఇబ్బంది పెడతారో.. కేసులు పెడతారోనని..! పక్కనే ఒక ఇల్లు ఉంది చూశారా.. లైటే లేదు. అదీ తెలుగుదేశం పార్టీ దెబ్బ' అని అన్నారు. 'టీడీపీ అంటే అనంతపురం... అనంతపురం అంటే టీడీపీ అని లోకేశ్ అన్నారు. 'మా కుటుంబాన్ని మీరు ఆశీర్వదించి దీవించారు. ఎన్టీఆర్, హరికృష్ణ, బాలకృష్ణను అక్కున చేర్చుకుని గెలిపించారు. మొన్నటి ఎన్నికల్లో సూపర్ మెజార్టీ ఇచ్చారు..' అని కృతజ్ఞతలు తెలిపారు.

సవాళ్లు అంటే ఇష్టం..

'నాకు సవాళ్లు అంటే ఇష్టం. అందుకే విద్యాశాఖను ఎంచుకున్నాను. మంగళగిరిలో మొదటిసారి పోటీ చేసినప్పుడు ఓడిపోయాను. అనేక రకాలుగా అవమానించారు. మొన్నటి ఎన్నికల్లో 91 వేల మెజార్టీతో గెలిచాను. అక్కడి నుంచి సౌండ్ లేదు. డీఎస్సీపైనా అనేక విధాలుగా మాట్లాడారు. 150 రోజుల్లో నిర్వహించి నియామకాలు చేపట్టాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. మన పిల్లల భవిష్యత్తు కోసం సీఎం ఎంతో కష్టపడుతున్నారు' అని లోకేశ్ అన్నారు. 'ఎన్నాళ్లు పక్కనున్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణను చూసి అసూయపడతాం..? ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజులు తీసుకువస్తాం' అని లోకేశ్ అన్నారు.

అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట...

'సీఎం చంద్రబాబును అనేక రకాలుగా అవమానించారు. మా తల్లిని అవమానించారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో 9 మంది భక్తులు చనిపోతే... ఆలయ నిర్వాహకుడు పాండా మాట్లాడిన మాటలపై ఫేక్ వీడియో తయారు చేసి వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేశారు. స్వామిని ప్రజల వద్దకు తీసుకెళ్తామని 94 సంవత్సరాల పాండా రూ.20 కోట్లు పెట్టి గుడి కట్టారని అన్నారు. ఘటన జరిగిన వెంటనే తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, అనితమ్మ హుటాహుటిన అక్కడకు వెళ్లామని అన్నారు. వైసీపీ వాళ్లు అది కూడా పాండా వ్యాఖ్యలను ఎడిట్ చేసి పర్మిషన్‌కు అప్లయ్ చేస్తే ఇవ్వలేదని ఫేక్ చేశారని మండిపడ్డారు. వైసీపీ వారికి శవ రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్యన్నారు.

చెల్లెమ్మ.. శ్రీచరణి..

మన తెలుగు బిడ్డ, క్రికెటర్ శ్రీచరణిని మూడు నెలల క్రితం విశాఖలో కలిసి బాగా ఆడాలని ప్రోత్సహించానని లోకేశ్ అన్నారు. వరల్డ్ కప్‌లో విజయం సాధించాక చెల్లెమ్మకి మంచి రివార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని అన్నారు. ఈలోగానే వైసీపీ వాళ్లు అక్కడ కూడా కులం ప్రస్తావన తెచ్చేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈరోజు ఉండవల్లిలో శ్రీచరణి నన్ను కలిసినప్పుడు 24 గంటలు ఎలా కష్టపడుతున్నారని అడిగిందని అన్నారు. రాజకీయాల్లో మార్పు తేవాలంటే కష్టపడి పని చేయక తప్పదు.. గతంలో 32 మంది కమ్మ డీఎస్పీలకు ప్రమోషన్ ఇచ్చామని తప్పుడు ప్రచారం చేశారని, చివరకు నలుగురు మాత్రమే ఉన్నారని తేలిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా... అధికారంలో ఉన్నా... చంద్రబాబు రేయింబవళ్లు కష్టపడతారని అన్నారు. 75 ఏళ్ల వయస్సులోనూ ప్రధాని మోదీ ఎంతో కష్టపడుతున్నారని అన్నారు. అందుకే వారిలో వయోభారం కనబడదని అన్నారు.



అమ్మా నమస్కారం..

చాలా అవసరం...

టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసికట్టుగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని లోకేశ్ అన్నారు. పదిహేనేళ్ల పాటు మనం కలిసికట్టుగా కృషి చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుదామని పవనన్న చెబుతున్నారని, ప్రభుత్వం కొనసాగింపు చాలా అవసరమని అన్నారు. గుజరాత్, ఒడిశాలో ప్రభుత్వ కొనసాగింపు వల్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్తాయని లోకేశ్ అన్నారు. కష్టపడినవారికే నామినేటెడ్ పదవులు ఇచ్చామని మంత్రి లోకేశ్ అన్నారు. కష్టపడేవారికి ఖచ్చితంగా తగిన ఫలితం ఉంటుందని ఆయన అన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు

జగన్‌రెడ్డి కార్యకర్తలను పట్టించుకోలేదు...

జగన్‌రెడ్డి ఏనాడూ సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని, కనీసం కార్యకర్తలకు చేయి అందించడని లోకేశ్ విమర్శించారు. కనీసం ఒక్క ఫొటో ఇవ్వరని అన్నారు. సొంత కార్యకర్త కారు కిందపడి చనిపోతే పక్కన పడేసి వెళ్లిపోయారని అన్నారు. దీనిని అందరూ గమనించాలని, కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. సమావేశం అనంతరం టీడీపీ కార్యకర్తలను కలిసి అర్జీలు స్వీకరించారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జోనల్ కో-ఆర్డినేటర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, చిన్నారుల కోలాహలం.



మంత్రి లోకేశ్‌కు హారతులు



అందరికీ అభివాదం..



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

కూటమిలో బీసీలకు పెద్దపీట

- కనకదాసు జయంతికి శాశ్వత జీవో
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



కళ్యాణదుర్గంలో భక్త కనకదాసు జయంతి, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అనంతపురం/కళ్యాణదుర్గం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భక్త కనకదాసు జయంతి వేడుకలు, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాతే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కిందని అన్నారు. కురుబలకు అన్ని రంగాల్లోను అవకాశం కల్పించింది టీడీపీ ప్రభుత్వంలోనే అని, గతంలో తన తండ్రి ఎస్ రామచంద్రారెడ్డికి మంత్రిగా, ఎంపీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. బీకే పార్థసారథికి ఎంపీగా, ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, తనకు చైర్ పర్సన్‌గా అవకాశం కల్పించారని అన్నారు. గత ఎన్నికల్లో ఇద్దరు కురబ నేతలకు ఎంపీలుగా, తనకు ఎమ్మెల్యేగా టిక్కెట్ ఇచ్చారని, గెలిచాక మంత్రిగా కూడా తనకు అవకాశం కల్పించింది టీడీపీనే అని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఏర్పాటు చేయించడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కనకదాసు విగ్రహావిష్కరణ శుక్రవారం జరుగుతుందని తెలిపారు. త్వరలో అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని, ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని అన్నారు. ఆదరణ-3 పథకం కింద కులవృత్తుల ప్రోత్సహిస్తామని తెలిపారు. కురుబ కులస్థులు చిరకాలంగా ఎదురుచూస్తున్న భక్త కనకదాసు జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడానికి శాశ్వత జీవోను కూడా శుక్రవారం విడుదల చేశామని మంత్రి తెలిపారు. శాశ్వత జీవో తెస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరిందని అన్నారు. శాశ్వత జీవో ఇచ్చినందుకు మంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కురుబ కులస్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా గుడికట్ల పూజారుల గౌరవ వేతనం, ధూప దీప నైవేద్యాలకు నెలకు రూ.7 వేలు అందజేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ, ఆ శాఖ జిల్లా అధికారి కుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలితో క్యాన్సర్ దూరం

- వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రసాయన సమ్మిళిత ఆహారాన్ని భుజించకపోవడం, వ్యసనాలకు దూరంగా ఉండడం, శరీరానికి శ్రమను పెంచడం వంటి ఆరోగ్యకరమైన జీవన శైలితోనే క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం రేడియేషన్ అంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రశాంతి అధ్వర్యంలో క్యాన్సపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శంకర్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు ఓపీ 222 ఏర్పాటు చేశామన్నారు. ఓపీ 6లో పాప్‌స్మియర్ పరీక్షలుచేసి గర్భాశయ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సరళ, సుచిత్ర, అసోసియేట్స్ నటేష్, మాధవీలత, సాయిరాణి, అసిస్టెంట్స్ సుష్మ, శ్రీనివాసరావు, నాగప్రవీణ్, గీతాంజలి, కుష్బూ, ఎన్ఎస్ఎస్ పీఓలు సుమన గోపీచంద్, లలిత, పరదేశినాయుడు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్...

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు సాగిన ర్యాలీని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జయలక్ష్మి, డీఎంఓ ఓబులు, డెమో నాగరాజు, హెచ్ఈఈఓ త్యాగరాజు, పీఎంఓ నాగన్న, డిప్యూటీ హెచ్ఈఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

భూముల పరిశీలన



తలారిచెరువు వద్ద భూమిని పరిశీలిస్తున్న దృశ్యం

తాడిపత్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారిచెరువు, భోగసముద్రం గ్రామాల పరిధిలో టిష్యూ కల్చర్ విధానంలో అరటి మొక్కల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు భూములను జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో టీబీఎస్ఎస్ఎల్ ఎండీ చేతన్‌జోష్, గ్లోబల్ అగ్రి సిస్టం ప్రైవేటు లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ శ్రీవాత్సవ్ శుక్రవారం పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ రాంమోహన్, ఏడీహెచ్ దేవానంద్, హార్టికల్చర్ ఆఫీసర్ ఉమాదేవితో కలిసి మూడు చోట్ల భూములను పరిశీలించారు. రెండ్రోజుల్లో వాటిని సర్వేచేసి నివేదికలు పంపిస్తామని అధికారులు తెలిపారు.

గ్రామీణులకు మెరుగైన సేవలే లక్ష్యం

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. స్థానిక వైద్య కళాశాలలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఐఎంఏ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డాక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడమే ఐఎంఏ లక్ష్యమన్నారు. ఇటీవ నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తనను, ప్రధాన కార్యదర్శిగా ఫణిమహేష్‌రెడ్డి, ట్రెజరర్‌గా అంజనీకుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, చంద్రమోహన్, సుప్రజా చౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మనోరంజన్‌రెడ్డితోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఐఎంఏ నూతన కమిటీ సభ్యులు

తడిసెడు కష్టాలు..!

- వర్షంలో తడిసి ముద్దయిన వేరుశనగ కాయలు, కట్టె
- అంతంతమాత్రం దిగుబడితో రైతుల ఇబ్బందులు
- గ్రాసం కూడా దక్కదని ఆవేదన



వానలో నానిన వేరుశనగ కట్టె



నానిన వేరుశనగ కాయలు



నీళ్లల్లో నానిన వాముకేసిన వేరుశనగ

తాడిపత్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, తెగుళ్లతో వేరుశనగ రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. జిల్లాలో ఎక్కువగా మెట్ట భూముల్లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇలా ఏడాదికి ఒక పంట దిగుబడితో వచ్చిన ఆదాయంతో సంవత్సరం పొడవునా కుటుంబాన్ని పోషించుకుంటాడు. దిగుబడి రాని ఏడాది అప్పులతో నెట్టుకురావాల్సిన పరిస్థితిని కొన్నేళ్లుగా జిల్లా రైతాంగం ఎదుర్కొంటోంది. వరుసగా కరువులు వస్తే మాత్రం చేసిన అప్పులు తీర్చలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం పరిపాటిగా మారింది.

వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గంలోని తాడిపత్రి మండలంలో 1100ఎకరాలు, పెద్దపప్పూరు 2119, యాడికి 2400, పెద్దవడుగూరు 1800ఎకరాల్లో ఈ ఏడాది వేరుశనగ సాగుచేశారు. కొంతమంది కౌలురైతులు కూడా వేరుశనగ సాగుచేశారు. విత్తనం సమయంలో తడిపొడి వర్షంతో పంట సాగుచేశారు. ఎకరాకు నాలుగైదు బస్తా(బస్తా 42కిలోలు)ల దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. పెట్టుబడి దాదాపు రూ.25వేల నుంచి 30వేలు పెట్టినట్లు పేర్కొన్నారు. పంట దిగుబడి, ధర బాగా ఉన్నట్లయితే పెట్టుబడులు పోయి ఎకరాకు రూ.15 వేల నుంచి 20వేలు మిగులుతుండేది. కానీ ఈ సంవత్సరం పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత ఉన్న వేరుశనగ కాయలను బస్తా రూ.2800 నుంచి 3200 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కానీ ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన వేరుశనగ కాయలకు ఎంత రేటు వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు పేర్కొన్నారు. వర్షం వల్ల పశువుల మేత కూడా నష్టపోయినట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి వేరుశనగ కట్టె, కాయలు పూర్తిగా నాని ముద్ద అయ్యాయని రైతులు వాపోయారు. వర్షం ఉన్నట్లుండి రావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉండిపోయామని రైతులు ఆవేదన చెందారు.

వర్షంతో తీవ్రనష్టం : మహబూబ్‌బాషా, రైతు, చీమలవాగుపల్లి



నాకున్న ఐదు ఎకరాలతోపాటు 15ఎకరాలు కౌలుకు తీసుకొని మొత్తం 20ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశా. ఇటీవల తుఫాన్ వల్ల వచ్చిన వానతో కొంతమేరకు వేరుశనగ కట్టె, కాయలు దెబ్బతిన్నాయి. కానీ బుధవారం కురిసిన వర్షానికి కొంత భాగం పంట నిట్టనిలువునా వర్షంలో తడిసి ముద్ద అయ్యింది. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి, ఆదుకోవాలి.

తెరిపి ఇవ్వడంతో కాయలు ఆరబెట్టాం: రసూల్, రైతు



మాకున్న 5ఎకరాలు సాగుచేశాం. కొంతభాగంలో వేరుశనగ కాయలు విడిపించి ఆరబెట్టాం. గత వారం రోజులుగా తుఫాన్ వల్ల ఆకాశం ముసురు వేసి ఉండటంతో ఎండలేక కాయలు ఆరలేదు. అయితేఏ రెండు రోజులుగా తెరిపి ఇవ్వడంతో కాయలను ఆరబెట్టాం. కానీ హఠాత్తుగా వచ్చిన భారీ వర్షం వల్ల వేరుశనగ కాయలు మొత్తం తడిసిపోయాయి.

అరకొరగా వేరుశనగ దిగుబడి

- కొనేవారి కోసం రైతుల నిరీక్షణ
- ధర లేక అన్నదాతల అగచాట్లు



తక్కువ ధరకే వేరుశనగ కాయలు అమ్ముతున్న రైతులు

శింగనమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతులకు ఖరీఫ్ సీజన్ యథా ప్రకారం నష్టాలనే మిగిల్చింది. తీవ్ర వర్షాభావంతో అరకొరగా పండిన దిగుబడిని కూడా కొనే నాథుడు లేక రైతులు పొలాల్లోనే ఆరబోసుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 2 వేల ఎకరాలకుపైబడి వేరుశనగ సాగు చేశారు. కే6, లేపాక్షి 10, 12 రకాలు సాగు చేశారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. తొలుత వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో పైరు ఏపుగా పెరిగింది. అయితే భూమిలో కాయలు ఏర్పడే దశలో వర్షాభావం వెంటాడింది. దీంతో విత్తనం పూర్తి స్థాయిలో ఏర్పడక కాయలు అవటను తగ్గాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల మొంథా తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు కాయలు మొలకెత్తుతున్నాయని పంటను తొలగించారు. పంట నూర్పిడి తర్వాత 47 కిలోల బస్తాను వ్యాపారులు రూ.2400 ధరకు అడుగుతున్నారని, ఈ ధరతో ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కోసం వేరుశనగ కాయలను కళ్లాల్లో రాశులు పోసి ఎదురు చూస్తున్నారు.

నష్టపోతున్నాం: కాయల వెంకటనారాయణ



గత పదేళ్ల నుంచి మాప్రాంతంలో వేరుశనగ పంట దిగుబడులు కనీసం పెట్టుబడులకైనా వచ్చేవి. ఈ ఏడాది నేను మూడు ఎకరాల సాగుకు రూ.90 వేలకుపైగా పెట్టుబడులు పెట్టా. అయితే పంట కాయల దశలో వాన రాకపోవడంతో దిగుబడులు తగ్గాయి. ఎకరానికి నాలుగు ఐదు బస్తాలే రావడంతో నాకు రూ.40 వేలు నష్టం వాటిల్లింది.

ఎవరు కొనుగోలు చేస్తారో



మేము నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాం. రూ.1.5లక్షల దాకా పెట్టుబడి పెట్టాం. విత్తనం బలిసే సమయంలో వాన లేక దిగుబడి తగ్గిపోయింది ఎకరానికి నాలుగైదు బస్తాలే దిగుబడి వచ్చింది. వాటిని కొనడానికి కూడా వ్యాపారులు ముందుకు రావడం లేదు.

\- మహిళ రైతు నాగలక్ష్మమ్మ, పెద్ద మట్లగొంది

ఎకరాకి నాలుగు బస్తాలే..



మేము ఆరు ఎకరాలు వేరుశనగ పంట సాగు చేశాం. పంట సాగు కోసం రూ.2.5లక్షలు ఖర్చు చేశాం. వర్షాలు రాకపోవడంతోపాటు మొంథా తుఫాన్‌తో దిగుబడులు ఎకరానికి నాలుగు బస్తాలు మాత్రమే వచ్చాయి. ధరలేని ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దిగుబడితో ఎలా బతికేది? ప్రభుత్వమైన పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

\- ఆదిలక్ష్మి, మహిళ రైతు, పెద్దమట్లగొంది

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంట్...

ద్వారం వెంకటస్వామి నాయుడు (జయంతి)



వయోలిన్ విద్వాంసుడు, 'పద్మశ్రీ' గ్రహీత ద్వారం వెంకటస్వామి నాయుడు 1893 నవంబరు 8న బెంగళూరులో జన్మించారు. 26ఏళ్లకే విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో వయోలిన్ ఆచార్యునిగా నియమితులై అనతికాలంలోనే ప్రిన్సిపాల్ అయ్యారు. సారంగిపై కర్ణాటక సంగీతం వినిపించిన తొలివ్యక్తి బహుశా ఆయనే కావచ్చు. సంగీతంపై ఎన్నో వ్యాసాలు రాశారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ, రాజాలక్ష్మీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1964 నవంబరు 25న కన్నుమూశారు. 1993లో ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

సితారా దేవి (జయంతి)



'కథక్' శాస్త్రీయ నృత్యకారిణి, 'పద్మశ్రీ' గ్రహీత సితారాదేవి 1920 నవంబరు 8న కోల్కత్తాలో జన్మించారు. డ్యాన్సర్‌గా, గాయని, నటిగా పేరొందారు. 16 ఏళ్లకే 'నృత్య సామ్రాజ్ఞి'గా రవీంద్రనాథ్ ఠాగూర్‌చే ప్రశంసలు పొందారు. సంగీత నాటక అకాడమీ, కాళి దాస్ సమ్మాన్ తదితర పురస్కారాలు పొందారు. బాలీవుడ్ ప్రముఖులకు సైతం కథక్ గురించి బోధించారు. 'కథక్ క్వీన్'గా నేటికీ అభిమానులచే పిలువబడుతున్నారు. 2014 నవంబరు 25న కన్నుమూశారు.

ఎల్‌కే అడ్వాణి (పుట్టినరోజు)



దేశ అత్యున్నతమైన 'భారతరత్న' గ్రహీత లాల్‌కృష్ణ అడ్వాణి 1927 నవంబరు 8న కరాచీలో జన్మించారు. 2002-04 మధ్యన ప్రధాని వాజ్‌పేయ్ హయాంలో 7వ ఉప ప్రధానిగా, కేంద్ర హోం మంత్రిగా వ్యవహరించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో వలంటీర్ నుంచి బీజేపీ సహసంస్థాపకులలో ఒకరిగా, జాతీయ రాజకీయ నేతగా ఎదిగారు. ఆయన రాసిన 'మై కంట్రీ మై లైఫ్' ఆటోబయోగ్రఫీ నాన్‌ఫిక్షన్ కేటగిరీలో బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నారు.

కజువో ఇషిగురో (పుట్టినరోజు)



నోబెల్ పురస్కార గ్రహీత 'సర్' కజువో ఇషిగురో 1954 నవంబరు 8న జపాన్ దేశం నాగసాకిలో జన్మించారు. ఆంగ్ల నవలా రచయిత, స్క్రీన్ రైటర్‌గా, చిన్నకథల రచయితగా పేరొందారు. ఫిక్షన్ రైటర్స్‌లో తనదైన గుర్తింపు పొందారు. 2017లో స్వీడిష్ అకాడమీచే సాహిత్యంలో 'నోబెల్ ప్రైజ్' పొందారు. 'ద రిమైన్స్ ఆఫ్ ది డే' నవలకు 'బుకర్ ప్రైజ్' లభించింది. 'నెవర్ లెట్ మి గో' నవలకు ప్రాచుర్యం లభించింది. అమెరికన్ అకాడమీ ఆఫ్ అచీవ్‌మెంట్స్ గోల్డెన్ ప్లేట్ అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. 'లివింగ్' సినిమాకు స్క్రీన్‌ప్లే రాయగా 2023 అకాడమీ అవార్డ్‌కు నామినేట్ అయ్యింది. ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ గుర్తింపు పొందారు.

బ్రెట్ లీ (పుట్టినరోజు)



ఆస్ట్రేలియా దేశానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు బ్రెట్ లీ 1976 నవంబరు 8న జన్మించారు. జట్టు తరపున 2003 వరల్డ్ కప్ దక్కించుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. తన కెరీర్‌లో 'ప్రపంచంలో ఫాస్టెస్ట్ బౌలర్స్'లో ఒకరిగా పేరొందారు. ట్వంటీ 20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించారు. వన్డేలలో 100 వికెట్‌లు వేగంగా సాధించిన రెండో ఆస్ట్రేలియన్ క్రికెటర్‌గా నిలిచారు. రిటైరయ్యాక నటుడిగా, ఫాక్స్ స్పోర్ట్స్ కామెంటేటర్‌గా కొనసాగుతున్నారు. సామాజిక సేవలు సైతం అందిస్తున్నారు.

అన్నదాతపై విరిగిన లాఠీ

(5వ పేజీ తరువాయి) 4వేలు తక్కువగా ఉత్పత్తి అయినట్టు చూపుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఐఐడీ ప్యారి షుగర్ కంపెనీ రూ.3,211 చెల్లిస్తోందని, కానీ మిగిలిన ఫ్యాక్టరీలు అంత మొత్తం చెల్లించడం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమారు 6 గంటలకుపైగా సభ జరిగింది. ఫ్యాక్టరీలు ప్రభుత్వ రాయితీలు పొందుతున్నాయని, కానీ రైతులకు ఇచ్చే విషయంలో మొండివాదనలు చేస్తున్నాయన్నారు. ప్రముఖ షుగర్ ఫ్యాక్టరీ యజమాని మురుగేశ్ నిరాణి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వంలోనూ చెరకు రైతుల సమస్య ఉందన్నారు. ఫ్యాక్టరీల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధర విషయంలో రెన్యూవల్ చేయడం లేదన్నారు. చక్కెర ఫ్యాక్టరీల మధ్య కనీసం 25 కిలోమీటర్ల దూరం ఉండాలని సూచించారు. ఎథనాల్ ధర పెంచే విషయంలో కేంద్రానికి విన్నవించాలని సూచించారు. కేంద్రప్రభుత్వం 2019 నుంచి చెరకు ధర పెంచడం లేదని, ఎథనాల్ ధర కూడా అలాగే ఉందన్నారు. ఇదే సమయంలోనూ పలువురు రైతులు మాట్లాడుతూ చెరకు సాగు అత్యంత ఖర్చుతో కూడుకున్నదని ఏడాదిపాటు సాగు చేస్తే ఒకసారి మాత్రమే కోతకు వస్తుందన్నారు. ఏడాదిపాటు ఎరువులు, నీరు సమకూర్చడంతోపాటు నిరంతరంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ పరిశ్రమలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం రైతులు రోడ్డెక్కారన్నారు. బెళగావి జిల్లా అధికారి టన్నుకు రూ.3,200 నిర్ణయించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. కోతలు, రవాణాతో సంబంధం లేకుండా ధర విధించారన్నారు. ఇందుకు పరిశ్రమలు కూడా అంగీకరించాలన్నారు. చెరకుకు రూ.3,250 చెల్లించేలా సూచించారు. చివరకు బెళగావి జిల్లా అధికారి నిర్ణయించిన రూ.3,200 అదనంగా వంద రూపాయలను ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంగా చెల్లించేలా సీఎం తీర్మానించారు. రాష్ట్రంలోని 81 ఫ్యాక్టరీల్లో 11 కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీలు కాగా 1 మాత్రమే ప్రభుత్వ ఫ్యాక్టరీ ఉంది. మిగిలినవన్నీ ప్రైవేటువే. దిగుబడిశాతం 10.25 ఉండే చెరకుకు రూ.3,100గాను, 11.25 దిగుబడి ఉండేవాటికి రూ.3,200 చెల్లించాలని తీర్మానించారు. అందుకు అదనంగా ప్రభుత్వం రూ.50, పరిశ్రమలు రూ.50 భరించాలని చర్చించారు. రాష్ట్రంలో గత ఏడాది 5.56 కోట్ల మెట్రిక్ టన్నుల చెరకు ఉత్పత్తి కాగా ఈ ఏడాది 6కోట్ల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.



భారీగా తరలి వచ్చిన రైతులు

సమస్య దాటవేయడం కాదు : కేంద్ర మంత్రి సోమణ్ణ

చెరకురైతుల సమస్య విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య దాటవేసేలా వ్యవహరించడం సరికాదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసేందుకు మేం సిద్ధంగా ఉన్నామని కేంద్రమంత్రి సోమణ్ణ తెలిపారు. ఆందోళన చేస్తున్న రైతులచెంతకు ముఖ్యమంత్రి వెళ్లాల్సి ఉండేదని, అప్పుడే వారి కష్టాలు ఏమిటో తెలిసేదన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

▸▸ స్టార్టప్ పార్క్ ప్రారంభోత్సవంలో డీసీఎం

బెంగళూరు, నవంబరు7 (ఆంధ్ర జ్యోతి): అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలు కావాలని డీసీఎం డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. దేశంలోనే తొలి స్టార్టప్ పార్క్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. సాంకేతిక రంగంలో స్టార్టప్‌లకు సమగ్ర అవకాశాలు ఉన్నాయన్నారు. ఐక్వా వెంచర్స్ సంస్థ భాగ స్వామ్యంతో అభివృద్ధి చేసిన స్టార్టప్ పార్క్ ఇన్నోవేషన్ హబ్ కానుందన్నారు. అంత ర్జాతీయస్థాయి నెట్‌వర్కింగ్, ఇంక్యుబేషన్, మెంటార్‌షిప్, పెట్టుబడిదారులతో సంబంధాలు సమ కూర్చడమే లక్ష్యమన్నారు. 10వేల స్టార్టప్‌లను ప్రారంభించి లక్ష ఉద్యోగాలు సృష్టించడం ఆశయం కావాలన్నారు. సంస్థ ముఖ్యుడు షఫిషౌకత్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



స్టార్టప్ పార్క్‌ను ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా సతీశ్‌శైల్



సీఎంకు ధన్యవాదాలు తెల్పుతున్న ఎమ్మెల్యే సతీశ్‌శైల్

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కారవార కాంగ్రెస్ ఎమ్మెల్యే, కర్ణాటక స్టేట్ మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ చైర్మన్ సతీశ్‌శైల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కెనరా డిస్ట్రిక్ట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు (కేడీసీసీ) అధికారేతర సభ్యుడిగా నామినేట్ చేశారు. వెంటనే ఉత్తర్వులు అమలులోకి వచ్చేలా పేర్కొన్నారు. దీంతో సతీశ్‌శైల్‌కు మరో కీలక బాధ్యత దక్కింది. ఈమేరకు సీఎం సిద్దరామయ్యను ఆయన శుక్రవారం కలసి ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సాహంగా మినీ కర్ణాటక గేమ్స్

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మినీ కర్ణాటక గేమ్స్ 2025 ఆరోరోజు పోటీలు ఉత్సాహంగా సాగాయి. వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, లాన్‌టెన్నిస్ పోటీలు జరిగాయి. వాలీబాల్‌లో ఫైనల్స్‌లో బాలికల విభాగంలో గదగ్ జట్టు 3-0 స్కోరుతో బెంగళూరు జట్టుపై విజయం సాధించింది. బాలుర విభాగంలో దక్షిణకన్నడ జట్టు 3-0 స్కోరుతో బెంగళూరు జట్టుపై సత్తా చాటుకుంది. పోటీ పోటీగా జట్లు తమ ప్రదర్శనను చాటాయి. కబడ్డీలో బాలుర విభాగంలో ఉత్తరకన్నడ జిల్లా జట్టు బెంగళూరు జట్టుపై 55-26 స్కోరుతో సత్తా చాటుకుంది. బాలికల విభాగం చిక్కమగళూరు జట్టు దక్షిణకన్నడ జట్టుపై 33-25 స్కోరుతో రాణించింది. ఫుట్‌బాల్‌లో బెళగావి, దక్షిణకన్నడ జట్లు 1-1 స్కోరుతో డ్రాగా మిగిలింది. దీంతో టై-బ్రేకర్ విధానంతో బెళగావి గోల్‌కీపర్ ఫైనల్ పెనాల్టీలో 3-2 స్కోరుతో గెలుపొందారు. లాన్ టెన్నిస్‌లో బాలికల సింగిల్స్ విభాగంలో మండ్యకు చెందిన ఉన్నతి వీ మురళీధర్ ఉత్తమ ప్రదర్శన చాటి బెంగళూరుకు చెందిన కాశ్వి వి.కోణంకిని 6-0, 6-1ను ఓడించారు. బాలుర విభాగంలో ఫైనల్స్‌లో తనయ్‌బాబు పై, బెంగళూరుకు చెందిన మాధవ్ దాధిజ్‌ను 6-2, 6-02 ఓడించారు. విజేతజట్లను ప్రత్యేకంగా అభినందించారు.



వాలీబాల్ విజేత గదగ్ బాలికల జట్టు

బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలి

▸▸ చిక్కబళ్ళాపుర జిల్లా అధికారి

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి ఇతరులకు అవకాశం దక్కేలా ఖాతాదారులు వ్యవహరించాలని చిక్కబళ్ళాపుర జిల్లా అధికారి రవీంద్ర అభిప్రాయపడ్డారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో బరోడా కిసాన్ పక్వాడా 8వ విడత ఆత్మనిర్భర్‌వైపు అనే ప్రత్యేక కార్యక్రమం జరిగింది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఈడీ బీనా వహీద్, వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ ఏబీ పాటిల్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ శ్రీవాత్సవ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సుమిత్ మిశ్ర, బెంగళూరు గ్రామీణ ప్రాంతీయ ముఖ్యులు రవీపాఠక్‌లు పాల్గొన్నారు. 1800మంది రైతులు భాగస్వాములయ్యారు. 193మంది రైతులకు 51 కోట్ల విలువైన రుణాలను మంజూరు చేశారు. బ్యాంకు అందిస్తున్న అత్యాధునిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



లబ్ధిదారులకు రుణాల చెక్ అందజేస్తున్న దృశ్యం

గ్రాంట్ల మంజూరులో తారతమ్యంపై అసంతృప్తి



మీడియాతో మాజీ మంత్రి లింబావళి తదితరులు

మహదేవపుర, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో అత్యధిక ఆస్తి పన్నుల కేంద్రమైన మహదేవపురకు ప్రభుత్వ గ్రాంట్లు సజావుగా అందడం లేదని మాజీ మంత్రి అరవింద లింబావళి ఆరోపించారు. చిక్క బెళ్ళందూరు సమీపంలోని కార్మెల్‌రాం-సర్జాపుర మెయిన్‌రోడ్డుకు వెళ్లే మార్గంలోని భూ యజమానులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన టీడీఆర్ మొత్తాన్ని ఇప్పించే హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు మొత్తం ఆస్తిపన్నులో సుమారు 65శాతం మహదేవపురనుంచే వస్తుందన్నారు. ఈ ఏడాది మాత్రం వెయ్యి కోట్ల రూపాయలకు పైగా పన్నుల సేకరణ జరిగిందన్నారు. గతంలో బీజేపీ హయాంలో పన్నుల సేకరణకు అనుగుణంగా గ్రాంట్లు మంజూరు చేసేవారన్నారు. ప్రస్తుతం బీబీఎంపీ పునఃవిభజన పేరిట నియోజకవర్గంలోని కొన్నిభాగాలను దక్షిణవలయానికి చేర్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక నిపుణుల సమితి సిఫారసు ప్రకారం ఒక నియోజకవర్గానికి ఒకే మండలి అధీనంలో ఉండాలని, రాజకీయస్వార్థం కోసం సరిహద్దులను మార్చారన్నారు. ఇక్కడ పన్నుల సేకరణ పెరిగిందని, కొన్ని ప్రాంతాలను వేరేడివిజన్‌కు మార్పు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టౌన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మహేంద్రమోది, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ రోడ్డులో విరిగిన చెట్టుకొమ్మలు

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సీబీఐ మెయిన్‌రోడ్డులోని చర్చ్ వద్ద శుక్రవారం సాయంత్రం చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. సాయంత్రం వాహనాలు తిరుగుతున్న తరుణ సమయంలో చెట్టు కొమ్మ పడింది. ఓకారుపై పడ్డంతో స్వల్ప నష్టం జరిగింది. ఓ కారుతోపాటు గూడ్స్ వాహనంపైనా కొమ్మలు విరిగిపడ్డాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి ఎలాంటి దెబ్బలు తగలలేదని తెలిసింది. అయితే చెట్టు కొమ్మలు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ మీద పడ్డాయి. వెంటనే విద్యుత్ నిలిచిపోవడంతో పెనుప్రమాదం తప్పినట్టయ్యింది. బెస్కాం సిబ్బంది, బీబీఎంపీ అత్యవసర విభాగం సకాలంలో స్పందించారు. చెట్టుకొమ్మలను తొలగించారు. కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో ఊరట పొందారు.



కారుపై పడిన చెట్టుకొమ్మలు

రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుంతకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై రైల్వే శాఖ స్థానిక తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌లో శుక్రవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించింది. ఉదయం తొమ్మిదిన్నరకు రైల్వే స్టేషన్‌లో ప్రమాద సైరన్ మోగగా యాక్సిడెంట్ రిలీఫ్ ట్రెయిన్ (ఏఆర్టీ), యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్ (ఏఆర్ఎంవీ)లను రైల్వే సిబ్బంది తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడ రైలు ప్రమాదం జరిగినట్టు, ఒక దానిపై ఒకటి ఎక్కిన స్థితిలో బోగీలు ఉండగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గ్యాస్ కట్టర్‌తో కిటికీ ఊచలను తొలగించి అగ్ని మాపక యంత్రాలతో మంటలను ఆర్పి అందులో ఉన్న ప్రయాణికుల పాత్రను పోషిస్తున్న సిబ్బందిని స్ట్రెచర్ల ద్వారా వైద్య శిబిరాలకు చేర్చారు. మొత్తం డ్రిల్ గంటన్నరలో పూర్తయిందని అధికారులు తెలిపారు.

కేబుల్ దొంగలను అరెస్ట్ చేయండి

యల్లనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లిలో పది రోజుల్లోనే సుమారు 30 మంది రైతులకు చెందిన పొలాల్లోని కేబుల్ చోరీ అయిందని, ఆ దొంగలను అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, బాధిత రైతులు ఎస్ఐ రామాంజనేయ రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఒక్కో బోరు నుంచి సుమారు 50 మీటర్ల వరకు వైర్ చోరీ అయిందని, మీటర్ వైరు ధర సుమారు 300 ఉందని వాపోయారు. అంతేకాకుండా లోపల నుంచి వైర్ లాగడంతో తిరిగి మోటార్‌కు వైరు మార్చుకోవడానికి మోటార్‌ను బయటకు తీయాల్సిన వస్తోందన్నారు.

ఐఎంఎస్ సదస్సులో ఆకట్టుకుంటున్న కెనరాబ్యాంకు స్టాల్



స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రులు

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ షో (ఐఎంఎస్) పేరిట బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటైన ప్రదర్శనలో కెనరాబ్యాంకు స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజెలు కెనరాబ్యాంకు స్టాల్‌ను సందర్శించారు. ఎంఎస్ఎంఈ, కార్పొరేట్ ఖాతాదారులకు బ్యాంకుకు సంబంధించిన సమగ్ర రుణాల పథకాలను జనరల్ మేనేజర్ మహేశ్ ఎం పై వివరించారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా ప్రదర్శనలు సాగుతున్నాయి.

ఆస్తిపన్నుల పెంపుపై జేడీఎస్ ఆందోళన

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్నులను పెంచి అన్నివర్గాల ప్రజలకు మోయలేనిభారం అంటగడుతున్నారని ప్రభుత్వంపై జేడీఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఫ్రీడంపార్కులో శుక్రవారం జేడీఎస్ మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ మాట్లాడుతూ ఏడాదికి 52 వేలకోట్ల రూపాయలు గ్యారెంటీలకు ఖర్చు పెడుతున్నారని మండిపడ్డారు. రూ.4లక్షల కోట్ల బడ్జెట్‌లో ఎక్కువశాతం గ్యారెంటీలకే ఖర్చు చేస్తున్నారని వాపోయారు. అభివృద్ధిపై ప్రభుత్వానికి ఆసక్తి లేదని విమర్శించారు. సామాన్యుడు ఉపయోగించే ప్రతి విభాగంపైనా పన్నులు, ధరలుపెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బస్సుచార్జీలు, విద్యుత్ చార్జీలు, మెట్రో, పాలతోపాటు చెత్తసేకరణకు పన్నులు పెంచారన్నారు. ప్రజలను ప్రశాంతంగా బతకనివ్వడం లేదన్నారు. జీఎస్టీ ద్వారా సామాన్యుడికి మేలు జరగాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం పెనుభారం మోపుతోందని మండిపడ్డారు. ఆందోళనకారులు విధానసౌధను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

వర్క్‌ప్లేస్ గ్రూప్‌లో ఎంఎస్ఆర్ రీగస్ సెంటర్

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వర్క్‌ప్లేస్ గ్రూప్ (ఐడబ్ల్యుజీ) తన రీగస్ బ్రాండ్ ద్వారా ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌ను లాంఛనంగా ప్రారంభించింది. ఎంఎస్ఆర్ నార్త్ టవర్‌లో ప్రారంభించినట్టు ప్రకటించారు. దేశంలోనే ప్రముఖ ఐటీ హబ్‌లలో ఒకటిగా ఐడబ్ల్యుజీ సీఈఓ మార్క్ డిక్సన్ ఉన్నట్టు ప్రకటించారు. 163 వర్క్‌స్టేషన్‌లు, 2 మీటింగ్ రూంలు ఉన్నాయన్నారు. స్టార్టప్‌లకు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎంఎన్‌సీ కంపెనీలకు అనుకూలం కానుందని ఎంఎస్ రామయ్య డెవలెపర్ అండ్ బిల్డర్ డైరెక్టర్ రక్షారామయ్య తెలిపారు. వర్క్‌ప్లేస్ కోసం వెతికే సంస్థలకు అన్ని సౌలభ్యాలతో స్థలం సమకూరుస్తామన్నారు.

ఆభరణాల అంశంలో నమ్మకమే ముఖ్యం

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆభరణాల ఎంపిక అంశంలో నమ్మకమే ముఖ్యమని కహ డైమండ్స్ ఫౌండర్ కాశిష్ కివేసర అభిప్రాయపడ్డారు. నగరంలో ప్రత్యేక షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాశిష్ మాట్లాడుతూ ఆభరణాలు అందంతోపాటు బాధ్యతను గుర్తు చేస్తాయన్నారు. స్వదేశీ ఆభరణాల బ్రాండ్ కహ ద్వారా అన్నివర్గాలకు ఆకట్టుకునేలా అందుబాటులో ఉన్నాయన్నారు.

కవితల పోటీల్లో కస్తూరిబాయికి పురస్కారం



డాక్టర్ కస్తూరిబాయి

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కవితల పోటీల్లో పాల్గొన్న డాక్టర్ కస్తూరిబాయికి పురస్కారం దక్కింది. విశ్వసాహితీ కళావేదిక నదిపై పడవపాట కవితా పోటీలలో 20మందిలో ఒకరిగా నిలిచినందుకు పురస్కారం దక్కినట్టు కస్తూరిబాయి తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులో విశ్వసాహిత్య కళావేదిక జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ కర్ణాటక రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నట్టు తెలిపారు.

బెంగళూరు స్కూల్‌కు సుస్థిరత పురస్కారం

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైట్‌ఫీల్డ్‌లో పేరొందిన బెంగళూరు స్కూల్‌కు అంతర్జాతీయస్థాయిలో సుస్థిరతా పురస్కారం దక్కింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఉషా అయ్యర్‌కు 'శాలా నాయకి' విభాగంలో సిల్వర్ హీరో పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉషా అయ్యర్ మాట్లాడుతూ ప్రి-స్కూల్‌లో విద్యార్థులు చదువు కంటే వారి ఆలోచనలను వెలికితీసి ఇష్టాలకు అనుగుణంగా బోధనలు చేస్తున్నామన్నారు. పిల్లల్లో మనసు వికసించేలా బోధనలు, ఆటలు ఉండాలనేది మా ఆశయమన్నారు. పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

గవిమఠం లీజు బకాయిలు రూ.2.2 కోట్లు

ఉరవకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గవిమఠానికి లీజుదారుల బకాయిలు పేరుకపోయాయి. ఉరవకొండ గవిమఠం స్థలంలో 314 దుకాణాలు ఉన్నాయి. వీటికి సంబంధించి లీజుదారులు రూ.2.22 కోట్లు దాకా బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 2019లో గవిమఠం స్థలాలను వేలం వేసేందుకు అధికారులు సిద్ధం కాగా లీజుదారులు కొంతమంది కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఐదేళ్ల నుంచి వారు లీజు చెల్లించకపోవడంతో వారి బకాయిలే సుమారు రూ.70 లక్షలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. స్టేను వెకెట్ చేయించడంలోనూ గవిమఠం అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కాగా బకాయిలున్న లీజుదారులకు సోమవారం నుంచి నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.85	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	5,717	10,601
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,584	10,241
నీటి నిల్వ (టీఎంసీలు)	79.30	101.77

లా విద్యార్థిపై పోక్సో కేసు

రాయచూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మస్కి తాలూకా దేసాయి భోగాపూర్ గ్రామానికి చెందిన శివమూర్తి అనే యువకుడి పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కొప్పళలో ఎల్ఎల్‌బీ చెదువుతున్న శివమూర్తి మస్కి తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని మాయమాటలు చెప్పి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని గుర్తించి తీసుకొచ్చిన పోలీసులు బాలికను వైద్య పరీక్షలకు పంపగా బాలిక గర్భం దాల్చినట్లు గుర్తించారు. దీంతో శుక్రవారం శివమూర్తి పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలువురు ఎస్ఐల బదిలీ

రాయచూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న సబ్ ఇన్స్‌పెక్టర్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హట్టి పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న సబ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హోసెకెరప్పను లోకాయుక్త స్టేషన్‌కు బదిలీ చేసింది. అక్కడ ఖాళీ అయిన స్థానం నుంచి బీదర్ సైబర్ స్టేషన్‌లో పని చేస్తున్న పీఎస్ఐ శివానంద ఎ గణేగార్‌ను నియమించబంధి. సింధనూరు సర్కిల్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న రాఘవేంద్ర జీఎస్‌ను లోకాయుక్త స్టేషన్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో సైదాపూర్ పోలీస్ స్టేసన్‌లో పని చేస్తున్న ఎస్ఐ వినాయక్‌ను నియమించింది. రైల్వే పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న సబ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బసవరాజ్ గురులింగప్ప తేలిను డీసీఆర్ఈ స్టేసన్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో బీదర్ డీఎస్పీ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్‌ను ఇక్కడ నియమిస్తు ఉత్తర్వులు జారీ చేసింది.

అంజనన్నా..ఆలకించవా..!

● అంజనాద్రిలో యథేచ్ఛగా దోపిడీ ● టెండర్ రూ.20 వసూలు చేస్తోంది రూ.60 ● పార్కింగ్ ఫీజుపై భక్తుల ఆగ్రహం

బళ్లారి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): హనుమంతుడి జన్మస్థలమైన అంజనాద్రి పర్వతం(బెట్ట)పై సిబ్బంది భక్తుల మోత మోగిస్తున్నారు. ఇక్కడికి దేశంలోని పలు ప్రాంతాలనుంచి హనుమాన్ భక్తులు తరలివస్తుంటారు. అయితే నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తూ భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారు. పర్యాటకుల రద్దీని చూసి కొందరు పార్కింగ్ ప్లేస్‌కు ఆనెగొంది పంచాయితీ పరిధిలో పార్కింగ్ మెయింటెన్స్ అని, వాహనాల భద్రత పేరుతో కొంత ఫీజు వసూళు చేసేలా టెండర్ పిలిచారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు తమ చేతివాటం చూపిస్తున్నారు. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు ఈ కాంట్రాక్టు దక్కించుకున్నాడు. నేతల అండతోనే అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. టెండర్‌లో రూ.20 నిర్ణయించగా రూ.60కిపైగానే వసూలు చేస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు.

ఏడాదికి రూ. 30 లక్షల టెండర్: ప్రతి సంవత్సరం ఆలయ కార్యనిర్వహక అధికారులు, అంజానాద్రి పార్కింగ్ స్థలానికి టెండర్ పిలిచి వేలం ప్రక్రియ నిర్వహిస్తారు. పార్కింగ్ స్థలాన్ని లీజుకు ఇస్తారు. దీన్ని దిక్కించుకున్న కాంట్రాక్టర్ వాహన దారులతో పరిమితి లేకుండా వసూళ్లు చేస్తున్నారని వాహనదారులు దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.



అంజాద్రి బెట్ట వద్ద నిలిపిన వాహనాలు



బస్సుపై విరిగిపడిన భారీ కొమ్మ

● ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పర్యాకట క్షేత్రం హంపిలో బస్సుపై భారీ వృక్షం కూలిపడింది. శుక్రవారం ఉదయం రాణి స్నాన వాటిక వద్ద ఓ టూరిస్టు బస్సు నిలిపి ఉంచారు. అక్కడున్న మర్రిచెట్టు పెద్దకొమ్మ ఒక్కసారిగా బస్సుపై విరిగి పడింది. అయితే ఆ సమయంలో బస్సులో పర్యాటకులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. వెంటనే అక్కడున్న సిబ్బంది అప్రమత్తమై బస్సుపై పడిన మర్రి చెట్టు కొమ్మను తొలగించారు. ఇకపై హంపిలోకి వచ్చే వాహనాలు చెట్లు లేని ప్రాంతాల్లో నిలుపుకోవాలని అధికారులు సూచించారు.

పర్యావరణ కాలుష్యంపై అవగాహన



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రాంతీయ రవాణా అధికారి శ్రీనివాస్ గిరి

బళ్లారి సిటీ/రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌టీఓ కార్యాలయంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ అవగాహన మాసాన్ని జరుపుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ రవాణా అధికారి శ్రీనివాస్ గిరి, సిబ్బంది తదితరులు పాల్గొని వారు మాట్లాడారు. పెరుగుతున్న వాహనాల వల్ల కాలుష్యం అధికమవుతోందని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు వాహన నియమాలను పాటించి కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు.

'సంచార జాతుల సమస్యలు పరిష్కరించాలి'

రాయచూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మమదాపూర్ గ్రామ శివారు, హోసూరు సమీపంలోని సీఎన్ కాలనీలో నివశిస్తున్న సంచార జాతుల కుటుంబాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐడీవైఓ జిల్లా అధ్యక్షుడు చన్నబసవ జానేకల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికులతో కలిసి తహసీల్దార్ సురేశ్ వర్మకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీ, ఎస్టీలకే..

● దుర్వినియోగం చేస్తే చర్యలు : కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్



బళ్లారి సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):షెడ్యూల్డ్ కులాల ఆర్థిక పరిస్థితిని మెరగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయిస్తోందని , ఆ నిధులను పూర్తిగా వారికే ఖర్చు చేయలాని జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, టీఎస్పీ పథకాల కార్యక్రమాల అమలుకు సంబంధించి కలెక్టర్ హాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల నిధులు దుర్వినియోగం కారాదన్నారు. జిల్లాలోని షెడ్యూల్డ్ రైతులకు సమాచారం అందజేసి రుణాలు అందేలా చూడాలన్నారు. వ్యవసాయం , ఉద్యాన శాఖ ద్వారా ఎస్సీ ఎస్పీ , టీఎస్పీ గ్రాంట్ల కింద అమలు చేయబడిన వివిధ సౌకర్యాలు, పరికరాలను యువ రైతులకు పంపిణీ చేయాలన్నారు. సబ్ ప్లాన్ కింద అమలు చేసే కార్యక్రమాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హ్యారీస్, అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, జడ్పీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే, జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి పాషా, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



సిద్దమ్మనహళ్లి గ్రంథాలయం వద్ద అదానీ ఫౌండేషన్ సభ్యులు

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కుడితిని సమీపంలోని సిద్దమ్మనహళ్లి గ్రామంలో కొన్ని రోజులుగా గ్రంథాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. స్థానిక ప్రజలు అదానీ సంస్థకు అధికారులకు గ్రంథాలయం నవీకరణ చేపట్టి ప్రజలకు అందుబాటులో చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు ముందుకు వచ్చి గ్రంథాలయాన్ని పునర్నిర్మించారు. శుక్రవారం అదానీ సంస్థ అధికారులు పునర్నిర్మాణమైన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. షబీర్ రిజ్వాన్ షేక్, యర్రిస్వామి, సుంకప్ప, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు సభ్యులు పాల్గొన్నారు.

బేబీ ద్వితమోహన్‌కు సీఎం అభినందనలు



బేబీ ద్విత మోహన్‌కుమార్

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల వయసులో ఎవరి సహాయం లేకుండా 44 నిమిషాల 8 సెకెన్లపాటు కూర్చుని 'వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకున్న బేబీ ద్విత మోహన్‌కు సీఎం ప్రశంసాపత్రం పంపారు. ఈ సందర్భంగా బేబీ ద్విత మోహన్ కుమార్ తండ్రి, రాష్ట్ర పోలీసులకు ఫిర్యాదుల ప్రాధికార సభ్యులు మోహన్ కుమార్ దానప్ప మాట్లాడుతూ తమ పాపకు సీఎం అభినందన పత్రం పంపడం ఆనందకరమన్నారు. సుమారు 44 నిమిషాల 8 సెకండ్లపాటు ఎవరి సహకారం లేకుండా కూర్చోని పాప రికార్డు సృష్టించిందన్నారు.

సీఐగా ఉదయ్ రవి బాధ్యతలు



రవిని అభినందిస్తున్న సీఐ సతీష్

బళ్లారి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఉదయ్ రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉదయ్ రవి, బళ్లారి జెస్కామ్ జాగృతి దళం సీఐగా విధులు నిర్వహించేవారు. బళ్లారి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న సతీష్ బళ్లారి జెస్కామ్ జాగృతి దళ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

రెజ్లింగ్‌లో సత్తా చాటిన మహాలక్ష్మి



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రహ్లద్ చౌదరి

బళ్లారి సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీమతి సరళాదేవి సతీశ్చంద్ర అగర్వాల్ ప్రభుత్వ పస్ట్‌గ్రేడ్ కళాశాల విద్యార్థిని మహాలక్ష్మి రెజ్లింగ్‌పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. హరపనహళ్ళిలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ప్రాంగణంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాల రెజ్లింగ్ టోర్నమెంట్‌లో ఆమె మొదటి స్థానం సాధించి సత్తా చాటింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రహ్లద్ చౌదరి, క్రీడా విభాగం సమన్వయకర్త తెంగూరి బసవరాజ్ తదితరులు అభినందించారు.

నేడు పాత్రికేయ సంఘం ఎన్నికలు

● ఏర్పాట్లు పూర్తి చేశాం: అధికారి నాగరాజు



బళ్లారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి జర్నలిస్టుల సంఘం (కర్నాటక కార్యనిరత పత్రకర్తల సంఘం) పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి నాగరాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై 3గంటలకు ముగుస్తుందని, ఆదేరోజు సాయంత్రం ఫలితాలు ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 95 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోటీలో 22 మంది ఉన్నారన్నారు. పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల వరకు ప్రచారం చేపట్టరాదన్నారు. ఓటర్ల స్వస్తిక్ గుర్తును వేయాలని అలా కాకుండా పెన్, పెన్సిల్, ఇతర సిరంజిలతో రాయకూడదని అలా చేస్తే, ఆ ఓటు చెల్లనిదిగా ప్రకటిస్తామన్నారు.

నేడు కృషి సమాజ్ భవనం ప్రారంభం

బళ్లారి, నవబంరు 7(ఆంధ్రజ్యోతి): కృషి సమాజ్ బళ్లారి జిల్లా యూనిట్ కార్యాలయాన్ని శనివారం పాత తాలూకా కార్యాలయం ప్రాంగణంలో ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్, ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, గణేశ్, నాగరాజు, ఎంపీ తుకారాం హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

హోసూరు జోన్



కార్పొరేట్ బయోడైవర్సిటీ అవార్డును అందిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

పరిశ్రమలకు పర్యావరణస్నేహి పురస్కారాలు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సూచనలు పాటిస్తున్న పరిశ్రమలకు పర్యావరణ బయోడైవర్సిటీ అవార్డులను కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రదానం చేశారు. హోసూరు అటవీ శాఖ, తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు, జిల్లా వాతావరణ మార్పు ఉద్యమం తరపున జరిగిన కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ కార్పొరేట్ బయోడైవర్సిటీ పురస్కారాలను అందచేశారు. పరిశ్రమలు ఆర్థికాభివృద్ధితోపాటు పర్యావరణం, జీవవైవిధ్యాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. హోసూరు ప్రాంతంలోని కర్మాగారాలు తమ ప్రాంగణలో, చుట్టుప్రక్కల చేపట్టిన జీవవైవిధ్య పరిరక్షణ ప్రయత్నాలను ఎంతో స్వాగతిస్తున్నారు. అటవీ శాఖ , కాలుష్య నియంత్రణ, జిల్లా వాతావరణ మార్పు ఉద్యమం యొక్క ఉమ్మడి ప్రయత్నాలకు ఈ చొరవ గొప్ప ఉదాహరణ అన్నారు. పరిశ్రమలలో పర్యావరణ బాధ్యతను ప్రోత్సాహించే ఉద్దేశ్యంతో హోసూరు అటవీ శాఖ, తమిళనాడు కాలుష్య నియంత్రణ వాతావరణ మార్పు సంయుక్తంగా కార్పొరేట్ బయోడైవర్శిటీ అవార్డును ప్రకటించాయి. ప్రభుత్వ ప్రమాణాల అమలుకోసం శాస్త్రీయమైన మూల్యాంకనం చేయడానికి ఒక స్క్రూటినైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేషన్ ఉన్నారు. ప్రమాణాలను పాటించిన టీవీఎస్ మోటార్ కంపెనీ, ఇంటియన్ నిప్పాన్ ఎలక్ట్రికల్స్ కంపెనీ నెరోలాక్ కంపెనీలను ఎంపిక చేశారు. కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ టైటాన్, టాటా ఎలక్ట్రానిక్స్, గ్లోబల్ కర్మాగారాలకు అప్రిసియేషన్ సర్టిఫికెట్లు అభించాయని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ సాధనకురళ్, భాగన్ జెగదీశ్ సుధాకర్, హోసూరు సబ్‌కలెక్టర్ ఆకృతిశెట్టి, కృష్ణగిరి రెవెన్యూ డివిజనల్ కమిషనర్ షాజహాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి: మేయర్



విద్యార్థులు, ఉపాధ్యాయులతో మేయర్ సత్య

హోసూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువులో రాణించాలని మేయర్ సత్య పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హోసూరు కార్పొరేషన్ కామరాజ్ కాలనీలోని ప్రాథమిక తెలుగు, కన్నడ చదువుతున్న 7వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వంపై (కార్పొరేషన్) సాంఘికశాస్త్రంలో ప్రభుత్వంపై ఒక భాగంగా అధ్యాయం వచ్చిందని అది అడిగి తెలుసుకోవాలని, విద్యార్థులు దానిపై అవగాహన పొందాలన్నారు. శుక్రవారం పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిఘంటువులు (డిక్షనరీలు) పంపిణీ చేశారు. మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్పొరేషన్ కమీసనర్ షబీర్ ఆలం, పట్టణాభివృద్ధి అధికారిణి అజిత, విద్యా కమిటీ చైర్మెన్ శ్రీధర్, ఆరోగ్య కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ సంస్థలు, పౌర పరిపాలన పనితీరు గురించి ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందడంలో విద్యార్థులకు సహాయం చేయడమే ఈ సందర్శన లక్ష్యమన్నారు. ఇది తరగతి గది, అభ్యాసం, నిజ జీవిత అనుభవంతో కూడిన ఆచారణాత్మక ప్రదర్శనను అందించింది, అనంతరం మేయర్ సత్య మాట్లాడుతూ విద్యార్థులైన మీరు దేశ భవిష్యత్తు పునాదుల వంటివారని, విద్యార్థుల కోసం వివిధ పథకాలను అమలు చేయడంలో దేశంలో తమిళనాడు ప్రభుత్వం అగ్రగామిగా ఉందన్నారు.

గుట్కా స్వాధీనం.. డ్రైవర్ అరెస్ట్

హోసూరు(క్రైం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో నిషేధించబడిన గుట్కాను ఓమ్ని బస్సులో అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో హోసూరు టౌన్ పోలీసులు కార్యాచరణ చేపట్టారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు రాయకోట రహదారిలోని అశోక్‌పిల్లర్ సమీపంలో టౌన్ పోలీసులు తనిఖీ చేశారు. బెంగళూరు నుంచి కోయంబత్తూరు వెళ్తున్న ఓమ్ని బస్సును తనిఖీ చేసి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. 105 కిల్లోల గుట్కా సహా ఓమ్ని బస్సును కూడా స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. విచారణలో కోయంబత్తూరు పీలమేడు కురుబల రోడ్డుకు చెందిన మణికంఠన్ (21)గా గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న గుట్కా సంచులు

సఫాయి కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారులుగా పనిచేస్తున్న పౌర కార్మికులకు ప్రభుత్వం చట్టబద్ధంగా అవసరమైన అన్ని సౌకర్యాలను అందించడం సంబంధిత పట్టణ స్థానిక సంస్థల ముఖ్య అధికారుల విధి అని జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని నూతన జిల్లా కలెక్టర్ భవనంలోని ఆడిటోరియంలో మాన్యువల్ స్కావెంజర్ల నియామక నిషేదం,వారి పునరావాస చట్టం కింద ఏర్పడిన మాన్యువల్ స్కావెంజర్లు(సఫాయి కార్మికుల)కు జిల్లాస్థాయి అవగాహన కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోని గృహనిర్మాణ,పారిశుద్య కార్మికులు పునరావాసం,పౌరకార్మికులకు వివిధ సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలి. పారిశుద్య కార్మికులకు నిర్ణయించిన వేతనాలను సకాలంలో చెల్లించడం , సౌకర్యాలు కల్పించడం అధికారుల బాద్యత అని అన్నారు.

భద్రతపై అవగాహన కల్పించాలి

జిల్లాస్థాయి మున్సిపల్ కార్పోరేషన్లు , మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీలు, గ్రామపంచాయతీల్లో పనిచేసే పారిశుద్య కార్మికులు , పౌరకార్మికులు, భద్రతా పరికరాలను తప్పకుండా ధరించాలని కలెక్టర్ సూచించారు. భద్రత ఆరోగ్యకారణాల దృష్ట్యా వారు భద్రతా పరికరాలను తప్పకుండా ధరించాలన్నారు. పర్యావరణ ఇంజనీర్లు దీనిని పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాస్థాయి అవగాహన కమిటీ సభ్యుడు కందకూర రాముడు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా కార్పోరేషన్ పరిధిలో పనిచేస్తున్న నిరాశ్రయులైన పౌర సేవకులకు స్థలం లేదా గృహ సౌకర్యం కల్పించలేదన్నారు. అయితే ఒకే స్థానంలో ఉన్న అధికారులకు మాత్రమే పదోన్నతి లభిస్తోందని, పౌర సేవకులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన తెలియజేశారు. దీనిపై స్పందిచిన జిల్లా కలెక్టర్ నగరంలో కార్పోరేషన్ ఆధీనంలో ఉన్న భూములన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటికి రక్షణ కల్పించాలన్నారు. నగరంలో ఖాళీగా ఉన్న భూముల గురించి వెంటనే సమాచారం అందించాలి. జిల్లాలోని వివిధ పట్టణస్థానిక సంస్థల్లోని పౌరకార్మికులకు ఆశ్రయం కల్పించడానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారీస్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్, జడ్పీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానంద, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి షాషు మోదిన్,కమిటీ సభ్యుడు అరుణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

శునకాలకు అడ్డాగా మారిన బస్‌స్టాప్

కంప్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డిగ్రీ కాలేజీ ఆవరణంలో పురసభ ఏర్పాటు చేసిన బస్‌స్టాప్ శునకాలకు అడ్డాగా మారింది. ఈ బస్టాండు నుండి ఆస్పత్రికి వెళ్లే ప్రయాణికులు ఇక్కడి నుంచే వెళ్తారు. కానీ ఆ బస్టాండులో సరైన వసతులు లేక శునకాలకు అడ్డాగా మారింది. ప్రయాణికులకు కూర్చున్న టేబుల్ పూర్తిగా ధ్వంసమైపోయాయి. కేవలం ఇనుప కడ్డీలు మాత్రమే మిగిలిపోయాయి. బస్‌స్టాప్ దుస్థితికి చేరుకోవడంతో ఇబ్బందిగా మారిందని, మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతన్నారు.



బస్టాండ్‌లో సేద తీరుతున్న శునకాలు

పథకాలు సక్రమంగా అందేలా చూడాలి

● లోకాయుక్త డీఎస్పీ రవిపురుషోత్తమ్

రాయచూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఇతర అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనని లోకాయుక్త డీఎస్పీ రవి పురుషోత్తమ్ అన్నారు. శుక్రవారం సింధనూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి వ్యతిరేక అవగాహన సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అధికారులతో అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన లోకాయుక్త డీఎస్పీ రవి పురుషోత్తమ్, సకాలంలో ప్రజల దరఖాస్తులను పరిష్కరించే బాధ్యత అధికారులదేనన్నారు. నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులను సకాలంలో పరిష్కరించకపోవడం కూడా అవినీతి నేరంలో భాగమేనని ఈ సందర్భంగా డీఎస్పీ తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడం ద్వార వారి హృదయాల్లో అధికారులు చోటు సంపాదించుకోవాలన్నారు. అదే సమయంలో అవినీతికి వ్యతిరేఖంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలోను అధికారులు అవినీతికి పాల్పడడం చట్ట విరుద్ధమని ఇందుకు కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు.

'వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి'

బళ్లారి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారి ఎర్రితాత కాంప్లెక్స్‌లో భారతి పాలిక్లీనిక్‌ను బగరు అధ్యక్షుడు తిమ్మనగౌడ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు, నగరవాసులకు ఈ క్లీనిక్ ఎంతో ఉపయోగకరమని, రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్ బసవరాజు, నవీన్, హనుమాన్‌గౌడ, గురు విశ్వనాథ్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యుడు రామిరెడ్డిని అభినందిస్తున్న అధ్యక్షుడు తిమ్మనగౌడ